క్లుప్తంగా

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



నర్వ: కల్వాల్ గ్రామంలో తప్పిపోయిన చిన్నారిని గ్రామ అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి చేరదీసి తల్లితండ్రులకు అప్పగించింది. సోమవారం అనుగొండ గ్రామానికి చెందిన అంజలి ఎల్లప్ప దంపతులు కల్వాల్ గ్రామానికి వచ్చారు. వారి కుమార్తె ఆడుకుంటూ తప్పిపోయింది. చిన్నారిని గమనించిన అంగన్‌వాడీ టీచర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచుకుని పాపను వెతుకుతున్న తల్లిదండ్రులకు అప్పగించింది. చిన్నారిని తమకు క్షేమంగా అప్పగించిన అంగన్‌వాడీ టీచర్‌కు వారు అభినందనలు తెలియజేశారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



ధన్వాడ: మండల కేంద్రంలోని 6వ వార్డులో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని కాలనీ వాసులు కోరగా ఆమె అండర్ డ్రెయినేజీ పైపులైన్ పనుల కోసం ఎమ్మెల్యే నిధులు కేటాయించారు. సోమవారం అధికారులు డ్రెయినేజీ పనులు ప్రారంభించడంపై కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, లక్ష్మయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిర్లింగాల మహాపూజ

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవాలయం ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ సోమవారం శివస్వాములు ఘనంగా నిర్వాహించారు. ఈ సందర్భంగా స్వామిని పంచామృతాలతో అభిషేకించి అర్చనలు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల శివస్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి




మరికల్: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని కన్మనూర్ గ్రామంలో సోమవారం 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకార్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దామోందర్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తీయాలి

మాగనూర్: మండలంలోని కోత్తపల్లి గ్రామంలోని పలు కాలనీలోని డ్రెయినేజీల్లో చెత్త, చెదారం చేరి మురుగు పారడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురుగు నిల్వతో దుర్వాసనతో పాటు దోమల చెడద అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు సందర్శించి మురుగు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అర్చకులపై దాడి హేయమైన చర్య



కొత్తకోట (ఆత్మకూర్): చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని, దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ధూపదీప అర్చక, బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి స్థానిక రాఘవేంద్ర స్వామి ఆలయంలో అర్చకులు సమావేశమై.. అర్చకులపై దాడులు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంతాచార్యులు, ప్రధానకార్యదర్శి శ్రీధర్‌జ్యోషి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రావు, ఉపాధ్యక్షుడు బాలింగయ్య, ప్రభాకర్ రావు, వెంకటనర్సింహారావు, భీంసేన్‌జ్యోషి, గుండాచారి, రాఘవేంద్రరావ్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



ఉందేకోడ్‌లో ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీహరి, నాయకులు

ధన్వాడ: మండలంలోని మందిపల్లితండా గ్రామంలో సోమవారం శివరామకృష్ణ అంజనేయస్వామి దేవాలయ ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివలింగం, నంది, ఆంజనేయస్వామి, నాగులు, ధ్వజస్తంభం, బొడ్రాయిలను ఒకేసారి ప్రతిష్ఠించారు. అనంతరం మహాకుంభ హారతి ఇచ్చారు. శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కంచాహారతులతో దేవాలయం వద్దకు చేరుకుని స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజు, బాల్ సింగ్, భక్తులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో ఘనంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం వేదమంత్రోచ్ఛరణల నడుమ గణపతి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని కందెన్‌పల్లి గ్రామంలో వెలసిన మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. వేద పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ మహా యజ్ఞం, విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంభాభిషేకం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి కొత్త దంపతులు భక్తులు మహిళలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముఖ్య అధితులుగా స్వామి ఆదిత్య పరాశ్రీ, శాందనంద్‌పు రోహిత్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక యాదవ సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బండారు ఉత్సవాలు..

నర్వ: మండలంలోని ఉందేకోడ్ గ్రామంలో బీరప్ప బండారు ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించనున్న బీరప్ప ఉత్సవాల్లో భాగంగా బండారు(పసుపు) చల్లే కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ కురుమ సోదరులు ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, మాదిరెడ్డి జలందర్‌రెడ్డి, దేవరి మల్లప్ప, చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, శరణప్ప కురుమ సోదరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో కనులపండువగా బీరప్ప బండారు ఉత్సవాలు జరుగుతున్నాయి. బీరప్ప స్వామి ఆలయ ఆవరణలో బండారు చల్లుకున్నారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.



బండారు వేస్తున్న డీసీసీ జిల్లా మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి



మందిపల్లితండాలో పూజలు చేస్తున్న శివస్వాములు

పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న మాధవరెడ్డి

ధన్వాడ: మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ పాఠశాలలో సోమవారం దాతల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఎద్దుల రాఘవేందర్ సొంత ఖర్చులతో 8 సీసీ కెమెరాలు మానిటర్ ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ మాధవరెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపై ప్రిన్సిపాల్ గంగమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, సూరిగౌడ్, రామాంజనేయులు, నరేందర్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన



దామరగిద్ద: ఎంపీటీసీ నియోజకవర్గాల వారీగా సిద్ధం చేసిన ఓటర్ల జాబితాను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాలకు గాను గతంలో ఉన్న ఎంపీటీసీ నియోజకవర్గాల ఆధారంగానే ఓటర్ల జాబితా ఉంటుందని తెలిపారు. 16 స్థానాల్లో మొత్తం 45,602 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 22,333, మహిళ ఓటర్లు 23,269 మంది ఉన్నారు.

ఓటర్ల జాబితా విడుదల..

నారాయణపేట రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుదర్శన్ సోమవారం మండలంలోని 28 గ్రామ పంచాయతీల ఓటర్ల వివరాలు ప్రకటించారు. కార్యలయంలోని నోటీసు బోర్డులో వివరాలు పొందుపర్చారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ సీట్లు గెలిపించి చూపించాలి

మక్తల్: రాబోయే స్థానిక ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంలో ఎవరి బలాబలాలేంటో తేల్చుకుందామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. కొడంగల్‌లో ధర్నా పేరుతో మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసరడం అర్థరహితమన్నారు. గతంలో ఇలాంటి పనికిరాని సవాళ్లు చాలా చేశారని గుర్తు చేశారు. వీలైతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొడంగల్‌లో ఎక్కువ ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు గెలిపించి మీ సత్తా నిరూపించుకోవాలని ఎమ్మెల్యే ఛాలెంజ్ విసిరారు. నర్వ మండల కేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే నన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందని, రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేటీఆర్ ఇలాంటి చిలిపి సవాళ్లు మానుకోవాలని లేకపోతే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్డు ప్రామాణికతను ఎత్తివేయాలి



ఏఓ జయసుధకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్: భూమిలేని నిరుపేద కూలీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీ జాబ్ కార్డును ప్రామాణికంగా తీసుకోరాదని అఖిల భారతీయ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సలీం అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఏఓ జయసుధకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రతి ఏటా రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఏడాదిలో కనీసం 20 రోజులైన ఉపాధి హామీ పనులు చేయాలన్న నిబంధన సరైంది కాదన్నారు. ఉపాధి హామీ కార్డు ప్రామాణికంగా తీసుకోకుండా ఆత్మీయ భరోసా పథకానికి నిజమైన లబ్ధిదారులను ఎంపికచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్కోటి చెన్నప్ప, వెంకటరాములు, హాజీమల్లంగ్, కనకరాయుడు, బాలు, గోవర్ధన్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ ఆహ్వాన కరపత్రాలు విడుదల



ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో ఈనెల 17న ప్రతిష్ఠాపన చేయనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆహ్వాన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహకులు రాజు మాట్లాడుతూ.. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ డీకే అరుణ, ఎంపీ ఈటల రాజేందర్, నేరడం పీఠాధిపతి సిద్ధలింగేశ్వస్వామి, ఆదిత్య పరాశ్రీస్వామి, శ్రీశక్తి పీఠం శాసన పురోహిత్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆలే శ్యాం కుమార్, అప్పల ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, రాంరెడ్డి, నర్సింగప్ప, బన్నేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీగా పోటీ చేస్తున్నా..



సిద్ధార్థరెడ్డి

కృష్ణా: రాష్ట్ర ప్రభుత్వం మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహిస్తుందన్న ప్రచారం ఉండడంతో ఆయా పార్టీల నాయకులు తమతమ అనుచర గణాలతో ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగానే జిల్లా సరిహద్దులోని కృష్ణా మండలంలో కూడ ఒక్కసారిగా రాజకీయ వేడి పులుముకుంది. కృష్ణా మండల జెడ్పీ స్థానం రిజర్వేషన్‌లో జనరల్‌గా వస్తే అధికార పార్టీకి చెందిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతదయాకర్‌రెడ్డి తనయుడు కొత్తకోట సిద్ధార్థరెడ్డి బరిలో ఉండనున్నట్లు కాంగ్రెస్ మండల నాయకులు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని టైరోడ్డులో సోమవారం సిద్ధార్థరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. కృష్ణా నుంచి జెడ్పీటీసీగా పోటీ చేస్తానని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో ఖచ్చితంగా గెలిచి తీరుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు చేస్తానని పేర్కొన్నారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు



కొత్తకోట (ఆత్మకూర్): వ్యవసాయ రంగంలో కాలానికి అనుగుణంగా వచ్చే ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించొచ్చని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తనయుడు అచ్యుత్‌రాం రాజ్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మండలంలోని రైతులు, నాయకులతో సమావేశమయ్యారు. డ్రోన్‌ల ద్వార పంటలకు మందు పిచికారీ చేయిస్తే సమయంతో పాటు కూలీల ఖర్చు ఆదా అవుతుందని, అధిక దిగుబడులు సాధించొచ్చని అన్నారు. రైతులు అత్యాధునిక వ్యవసాయానికి అలవాటు పడాలని మార్కెట్లో డ్రోన్లు, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, గద్దం శ్రీనివాస్‌యాదవ్, జుబేర్, గణేష్, దామోదర్, అశోక్, హరీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఊట్కూరు: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ చింతరవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని పేర్కొన్నారు.

మాగనూర్: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అందజేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పెద్దజట్రం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్

ఊట్కూరు : విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దజట్రం, అవుసలోనిపల్లి పాఠశాలలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఊట్కూరు గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, బాలప్ప, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం పోరాటానికి సిద్ధం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట (దామరగిద్ద) : నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా రైతుల అనుమతి లేకుండా దౌర్జన్యంగా భూములను లాక్కుంటే న్యాయ పోరాటానికి సిద్ధమని మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుభాష్, బాపన్‌పల్లి మాజీ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్‌ల సమక్షంలో జిల్లా కలెక్టర్ ఆర్డీఓ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు మద్దతుగా జిల్లా అధికారులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తరతరాలుగా భూమిని నమ్ముకొని బతుకుతున్న గిజరిన పేద రైతుల భూములను అభివృద్ధి పేరుతో లాక్కోవడం సరికాదన్నారు. దామరగిద్ద తండా, బాపన్‌పల్లి శివారులో రైతుల పంట పొలాల్లో పంపుహౌస్, పవర్ స్టేషన్ నిర్మాణం పనులు వెంటనే నిలిపివేయాలన్నారు. పేరపళ్ల జయమ్మ చెరువు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో గుట్టపై పంపుహౌస్, పవర్ స్టేషన్ నిర్మించాలన్నారు. రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా ప్రభుత్వం సర్వే చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాపన్‌పల్లి, దామరగిద్ద తాండ రైతులు బాబునాయక్, మహిళా రైతులు పాల్గొన్నారు.

భూసర్వే వ్యతిరేకిస్తూ రైతుల ఫిర్యాదు



కలెక్టరేట్ ఎదుట రైతులు

నారాయణపేట : నారాయణపేట– కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో భాగంగా చేపడుతున్న భూసేకరణను వ్యతిరేకిస్తున్నామని భూములను కోల్పోతున్న రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మక్తల్ మండల పరిధిలోని కాట్రేవుపల్లి, ఎర్నగన్‌పల్లి గ్రామాల్లో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు సర్వే చేస్తునారని, ఇప్పటికే గతంలో తాము భీమా ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయినట్లు తెలిపారు. తమకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడం తగదన్నారు. ప్రాజెక్ట్ డిజైన్ మార్చి వేరే మార్గం గుండా సర్వే చేపట్టాలని కోరారు. భూములను కోల్పోతే రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. లేని పక్షంలో కోల్పోయిన భూమికి బదులుగా మరోచోట భూములు సేకరించి ఇవ్వాలని ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో రైతులు రాజు, అశోక్, సోమన్న, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



నర్వలో విద్యార్థులను సన్మానిస్తున్న విశ్రాంత పీఈటీ గోపాలం

నర్వ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని విశ్రాంత పీఈటీ గోపాలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్, సైక్లింగ్ పోటీలకు ఎంపికై నందున వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పోటీలకు ఎంపికయ్యేలా చేసిన పీఈటీ స్వరూపను అభినందించారు. ఈనెల 21 నుంచి 23 వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు మల్లేష్, మన్యం, సురేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను స్థానిక బీటీఎం ఫౌండేషన్ అధ్యక్షుడు తిమ్మయ్య పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు దాదాపు 50 మందికి అందజేశారు. అదే విధంగా గతకొన్ని రోజుల క్రితం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10 వేలు విలువచేసే బహుమతులు అందించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు బీటీఎం ఫౌండేషన్ అధ్యక్షుడు, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కుర్మన్న, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శేఖర్, పీఈటీ మీనాకుమారి, ఉపాధ్యాయులు రమేష్, మాధవి, తిమ్మప్ప, కలిమొద్దీన్, పౌండేషన్ సభ్యులు వెంకటేష్ గౌడ్, సోఫి, రవి కుమార్‌గౌడ్, గౌస్, పరుశరామ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



పరీక్షా పే చర్చా కార్యక్రమం వీక్షిస్తున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: ప్రధాని మోదీ సోమవారం నిర్వహించిన పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని పట్టణ, మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు వీక్షించారు. ఆయా పాఠశాలల్లో ప్రాజెక్టర్ల ద్వారా మాట్లాడిన అంశాలను విద్యార్థులు లైవ్‌లో చూడడంతో పాటు, వారి సందేహాలను స్థానిక ఉపాధ్యాయులతో చర్చించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డీఈవో గోవిందరాజు, అధికారులు రాజేంద్రకుమార్, యాదయ్య శెట్టి, జాజాపూర్ జెడ్పీ పాఠశాలలో డీఎస్‌ఓ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరకు సిద్ధం

- నేడు సాయమ్మ నోటికి తాళం
- ఐదువారాల పాటు ఉత్సవాలు

నారాయణపేట రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో కొలువు దీరిన ఎల్లమ్మ దేవత జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఐదు మంగళవారాల పాటు జరిగే ఏకైక జాతరగా నిలిచిన లింగంపల్లి ఎల్లమ్మ జాతర మొదటి మంగళవారం ఈనెల11న ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పెద్దబోనం కుండ ఊరేగింపు, అలంకరణ, పూజలు, అమ్మవారి భక్తురాలు సాయమ్మ నోటికి తాళం వేసే ఘట్టం నిర్వహించనున్నారు. 12న బుధవారం పూజ, మహా మంగళహారతి కార్యక్రమాలు జరుగుతాయి.

సాయమ్మ నోటికి తాళం...

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అమ్మవారి భక్తురాలు సాయమ్మ నోటికి వేసే తాళంతో పాటు పెద్ద బోనం కుండ ఊరేగింపు కార్యక్రమాలు కనులపండువగా జరుగుతాయి. అమ్మవారి భక్తురాలు శరీరానికి (పుట్టం)వేప మండలతో చుట్టి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టగానే సాయమ్మ పూనకంలోకి వెళ్తారు. బైండ్లోలు ఆమెకు గవ్వల దండ వేసి ఆమె నోటికి రాగి తీగతో కూడిన తాళం వేసే దృశ్యం అందరిని గగుర్పాటు కలిగిస్తుంది. ఆ తర్వాత పెద్ద బోనం కుండతో కలిసి అమ్మ వారి భక్తురాలిని దేవాలయంలో పరశురాముని విగ్రహం వరకు తీసుకెళ్లి ఆ తర్వాత గుడి చుట్టూ ప్రదక్షిణ చేయించి మరోసారి పరశురాముని సన్నిధి వరకు తీసుకెళ్లి క్రతువుని ముగిస్తారు. వలస వెళ్లిన ఈ ప్రాంతపు కుటుంబాలు చివరి మంగళవారాల్లో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటారు. శివమాల ధరించిన కుటుంబాలు మాత్రం శివరాత్రి తర్వాతనే ఎల్లమ్మ దేవతను పూజించడం ఆనవాయితీగా వస్తుంది.

గ్రామ పెద్దల ఆధ్వర్యంలో...

ఈసారి జాతర మహోత్సవాలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2022లో దేవాలయ కమిటీ చైర్మన్ హన్మేష్ చారి(మాజీ వీఆర్ఓ)ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. 2023, 2024లో పాలకవర్గాన్ని పక్కకు పెట్టి గ్రామ పెద్దలు, పూజారులు, మ్యాతర్ల ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలను నిర్వహించారు. ఈసారి కూడా గ్రామ పెద్దలు, పూజారులు, మ్యాతర్ల ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు.

ప్రత్యేక పోలీస్ బందోబస్తు...

లింగంపల్లి ఎల్లమ్మ దేవత మహోత్సవాలకు వేలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో నారాయణపేట రూరల్ పోలీసులు ప్రత్యేక బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులు లింగంపల్లి స్టేజీ వరకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు పూజలకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి హాజరవనున్నారు.



లింగంపల్లి ఆలయం



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ దేవత విగ్రహం